ప్రజాశక్తి

బుధవారం 28 మే 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

నగరానికి యోగా ఫీవర్!



- స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర పోయె.. నేడు యోగాంధ్ర!
- 21న ప్రపంచ బుక్ రికార్డు కోసం యంత్రాంగం కసరత్తు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఏ నినాదం వెనక ఏ వర్గ ప్రయోజనాలు దాగి ఉంటాయో తెలుసుకోలేనంత కాలం ఆ నినాదాలను నమ్మే జనం మోసపోతూ ఉంటారన్న మాటలు ఎంత నిజమైనవో తాజాగా పాలకులు ఇచ్చే నినాదాలు చూస్తే అర్థమవుతోంది. ఢిల్లీ నుంచి గల్లీ దాకా మోడీ స్వచ్ఛభారత్ నినాదం గురించి చూశాం. ఆ తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రిగా గతంలో పనిచేసిన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు స్వర్ణాంధ్ర నినాదం ఇచ్చారు. ఆచరణలో ఇవి ఎంత వరకూ సక్సెస్ అయ్యాయన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. తాజాగా మన దేశ యోగా గురు ప్రధానమంత్రి మోడీ మరో నినాదం ఇవ్వడంతో అంతా అటువైపే మధ్యతరగతి, నయా ధనిక వర్గ ప్రజలంతా డైవర్షన్ అయ్యారు. జూన్ 21వ తేదీన విశాఖలో ప్రపంచ యోగా ఉత్సవాన్ని నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సందర్భంగా ఆయన విశాఖకు రానున్నారు. ప్రపంచ యోగా దినోత్సవంలో పాల్గొని 'యోగా విన్యాసాల' ప్రాధాన్యతలను వివరిస్తారు.

విశాఖ నగరం, జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులందరితోనూ ప్రతిరోజూ యోగా ప్రాక్టీస్ కోసం జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు, రాష్ట్ర స్థాయి అధికారులను సైతం ప్రభుత్వం పంపుతోంది. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో చేరేందుకు ఢిల్లీ నుంచి గల్లీ దాకా ప్రభుత్వ అధికార యంత్రాంగం మెడపై కత్తి పెట్టి మరీ యోగా డే విజయవంతానికి తీవ్ర స్థాయిలో ఆపసోపాలు పడడం తెలిసిందే. ఈ నేపథ్యంలో గడిచిన 15 రోజులుగా విశాఖ జిల్లా అధికార యంత్రాంగంలో యోగా ప్రణాళికలు, పథకాలు, కార్యాచరణలే కనిపిస్తున్నాయి. రాష్ట్ర స్థాయి ఐఎఎస్ అధికారుల వరకూ ఇదే తంతు సాగుతోంది. సమాజంలో మారిన జీవన విధానం (లైఫ్‌స్టైల్), ఆహారపు అలవాట్ల కారణంగా శరీరాకృతుల్లో తేడాలు రావడంతో ఒంటికి యోగా మంచిదేగా అనే వ్యాఖ్యలు తరచూ వింటున్నాం. యోగాతో అనారోగ్య సమస్యలు పోయి ఫిట్‌నెస్ పెరుగుతుందని, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నది ఎవ్వరికీ తెలియని విషయం కాదు. కానీ ప్రభుత్వ యంత్రాంగానికి వేరే పనిలేకుండా ఇదే పనిగా ఈనెల 21 వరకూ ప్రణాళికల తయారీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని ముంచెత్తేందుకు సిద్ధమయ్యాయి.

సమస్యల దారిమళ్లింపే లక్ష్యమా?

డైవర్షన్ పాలిటిక్స్ చేయడంలో దేశంలో కాషాయ దళాన్ని మించిన రాజకీయ పార్టీ ఏదీ లేదనే చెప్పాలి. నిరుద్యోగ భూతం యువతను పట్టిపీడిస్తోంది. ఒక పక్క ఉత్తరాంధ్ర విశాఖపట్నం నుంచి సైతం పనుల కోసం యువత ఇతర ప్రాంతాలకు పని, ఉపాధి కోసం వలసలు పోతున్న సన్నివేశాలు తాజాగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు నిలయమైన విశాఖలో స్టీల్‌ప్లాంట్, పోర్టు ట్రస్ట్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్, హెచ్‌పిసిఎల్ వంటి సంస్థలెన్నో ఉన్నా ప్రభుత్వ ఉద్యోగాల ఊసే లేదు. 2014 నుంచి కేంద్రంలో బిజెపి అధికారంలో ఉంది. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు యువతకు ఉంటాయని అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం 3 దఫాలుగా అధికారం వెలగబెడుతూనే

మిగతా 2లో..





ముట్టడినుద్దేశించి మాట్లాడుతున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

ముట్టడినుద్దేశించి మాట్లాడుతున్న అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ జగ్గునాయుడు

ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి

ప్రజాశక్తి-ఉక్కునగరం

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపును వ్యతిరేకిస్తూ చేపట్టిన అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి విజయవంతమైంది. విధుల్లోకి తీసుకోవాలంటూ సోమవారం సాయంత్రం వరకు రీజనల్ లేబర్ కమిషన్ వద్ద జరిగిన చర్చలు విఫలం కావడంతో అడ్మిన్ బిల్డింగ్ ముట్టడికి అఖిలపక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ పిలుపుతో విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి చేపట్టారు. స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ వద్ద మంగళవారం ఉదయం నుంచి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అడ్మిన్ బిల్డింగ్ ముట్టడిపై ముందస్తు సమాచారం ఉన్న పోలీసులు భారీగా మోహరించి కార్మికులను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. అడ్మిన్ బిల్డింగ్ లోపలకు కార్మికులు వెళ్లడానికి ప్రయత్నించడంతో పోలీసులకు, కార్మికులకు మధ్య తోపులాట జరిగింది. ఓ కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ ముట్టడిని ఉద్దేశించి విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తదితరులు మాట్లాడారు.

ప్రధాన వార్త మెయిన్‌లో...

గీతం డిగ్రీ, పీజీ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలు

వార్త 3లో..

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలని భిక్షాటన

వార్త 6లో..

కన్జర్వేటివ్ రక్షిత ప్రాంతంగా కొండకర్ల ఆవ

వార్త 6లో..

లాడ్జీలు, హోటళ్లలో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాలను నిరోధించడంలో భాగంగా సోమవారం రాత్రి 11 గంటల సమయంలో నగరంలోని జోన్ -1, జోన్ - 2 పరిధిలో ఏకకాలంలో 80 లాడ్జీలు, హోటళ్లఓ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

తప్పిపోయిన వ్యక్తులెవరైనా లాడ్జీలు, హోటళ్లలో ఉన్నారా? విదేశీ అతిథులు పాస్‌పోర్టు లేకుండా ఉన్నరా? మైనర్ అమ్మాయిలు హోటళ్లలో బస చేయటం, హోటళ్లలో వ్యభిచార కార్యకలాపాల నిర్వహణ వంటి అంశాలపై తనిఖీలు చేశారు. హోటళ్ల ఎన్ఒసి, ట్రేడ్ లైసెన్స్, జిఎస్‌టి సర్టిఫికెట్లు ఉన్నాయా లేదా అన్నది విచారించారు. 18 ఏళ్ల లోపు పిల్లలు ఎవరైనా పనిచేస్తున్నారా? మద్యం అమ్ముతున్నారా? తదితరాలను పరిశీలించారు. సీసీ కెమెరాల ఫుటేజీ, విజిటింగ్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. గంజాయి, ఆయుధాలు మందుగుడు సామాగ్రి ఎవరైనా కలిగి ఉన్నారా వంటి అంశాలనూ తనిఖీలు చేశారు.

ఈ తనిఖీల్లో 8 హోటళ్లు, లాడ్జీల్లో అగ్నిమాపక ఎన్ఒసిలు లేవని, ఏడింటికి ట్రేడ్ లైసెన్సులు లేవని, 22 హోటళ్లు, లాడ్జీలకు ఎఫ్ఎస్ఎస్ఎఐ లైసెన్స్ లేదని, పన్నెండింటికి జిఎస్‌టి సర్టిఫికెట్ లేదని,ర ఏడు హోటళ్లలో సందర్శకుల సమాచారాన్ని సరిగ్గా నిర్వహించడం లేదని పోలీసులు గుర్తించారు. వీరందరిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయా శాఖలకు నివేదికలు పంపనున్నట్టు పోలీసులు తెలిపారు.

యోగా దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి.కృష్ణబాబు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్టణం వేదికగా జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, ఇతర అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్) ఎంటి.కృష్ణబాబు మంగళవారం సమీక్ష నిర్వహించారు. యోగా దినోత్సవ ఏర్పాట్లు, క్షేత్రస్థాయి పరిస్థితులపై అధికారులకు కృష్ణబాబు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏర్పాట్లను ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా చేయాలని, చిన్నపాటి సమన్వయ లోపం కూడా తలెత్తకుండా విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, దాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకొని కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని చెప్పారు. ప్రతి కంపార్ట్‌మెంట్ వద్ద అన్ని రకాల వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, మొబైల్ టాయిలెట్, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. వాలంటీర్ల సాయంతో కంపార్ట్‌మెంట్ లోపలికి వచ్చే వారిని సాంకతిక పరికరాలను ఉపయోగించి లెక్కించాలని, దానికి ముందుగా ప్రతి ఒక్కరికీ క్యూఆర్ కోడ్‌లను అందజేయాలని సూచించారు. కంపార్ట్మెంట్ వద్ద స్రెచర్, మెడికల్ కిట్లను ఉంచాలని, ప్రతి రెండు, మూడు కంపార్ట్‌మెంట్లకు ఒకటి చొప్పున వైద్య శిబిరాలను ఏర్పాటుచేయాలని, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. దీనికి ముందు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ వీర పాండియన్, ఆయూష్ డైరెక్టర్ దినేశ్ కుమార్‌తో కలిసి ఆర్‌కె బీచ్ నుంచి భీమిలి వరకు కార్యక్రమం జరిగే వివిధ ప్రాంతాలను పరిశీలించారు.

జూన్ 19న ఫుల్ డ్రెస్ రిహార్సల్

జూన్ 19వ తేదీన ఫుల్ డ్రెస్ రిహార్సల్ కార్యక్రమం నిర్వహించాలని అధికారులకు కృష్ణబాబు సూచించారు. పూర్తి స్థాయిలో శిక్షణ పొందిన వారితో ఆ కార్యక్రమం చేపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాల్లో ప్రతి రోజూ

మిగతా 2లో..

పోలీసుల అమానుష దాడిపై నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తెనాలిలో దళిత, మైనార్టీ యువకులపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తూ మంగళవారం ఎల్ఐసి సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, మైనార్టీలపై దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. తెనాలిలో పట్టపగలు నడిరోడ్డుపై అమానుషంగా జరిగిన సంఘటనే ఇందుకు ఉదాహరణ అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మనువాదాన్ని అమలు చేయడానికి రాష్ట్రంలో దళితులు, మైనార్టీలపైన కూటమి ప్రభుత్వం చేత దాడులు చేయిస్తోందని విమర్శించారు. తెనాలిలో ముగ్గురు యువకులపై పోలీసు అధికారుల అమానుష దాడిని రాష్ట్రంలో ఉన్న ప్రజలందరూ ఖండించాలని విజ్ఞప్తి చేశారు. దాడి చేసిన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. 24 గంటలలో చర్యలు తీసుకోపోతే రాష్ట్రంలో ఉన్న దళితులు, మైనార్టీలను ఏకం చేసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు ఎం.సుబ్బారావు, ఎర్రిబాబు, కె.చంద్రశేఖర్, చంద్రమౌళి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు

నగరానికి యోగా ఫీవర్!

ఉన్నా దేశంలో నిత్యావసర సరకుల ధరలను, పేదరికాన్ని తగ్గించింది లేదు. ఉపాధి అవకాశాలు చూపించింది లేదు. ఈ నేపథ్యంలో యోగా విన్యాసాలవైపు జనాన్ని డైవర్షన్ చేసేందుకు మోడీ చూస్తుంటే రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేన పార్టీలు బిజెపికి వంతపాడుతున్నాయి. ఇటీవల కాలంలో ఆంజనేయ జయంతి ఉత్సవాల నిర్వహణలో ఆ పార్టీ మూల సంస్థల ప్రతినిధులు రోడ్లపై తెగబడిన తీరు తెలిసిందే. జిల్లా కలెక్టరేట్ అధికారుల లెక్కల ప్రకారం 25 లక్షల మంది విశాఖ జిల్లా జనాభాలో 8 లక్షల మందికి పైగా కొనుగోలు శక్తి క్షీణించింది. ఉపాధి అవకాశాలు పూర్తిగా సన్నగిల్లడం, పరిశ్రమలు కొత్తవి రాకపోవడం పెద్ద సవాలుగా ఉంది. ఇవేవీ పట్టకుండా తాజాగా యోగా డే పేరుతో జనాన్ని తరలించేసి ప్రచారం పొందాలని చూడడం వికటాట్టహాసం మినహా మరొకటి కాదు.

తాజాగా కరోనా వ్యాప్తి జరుగుతుందన్నది సర్వత్రా వినిపిస్తున్న మాట. గతంలో కూడా మోడీ ప్రభుత్వం కోవిడ్ కాలంలో కుంభమేళాల పేరుతో ప్రజలను ఆధ్యాత్మికంలోకి ముంచెత్తిపోయడంతో కరోనా కేసులు దేశంలో పెరిగిపోయాయి. ప్రస్తుతం ఆర్‌కెబీచ్ నుంచి భీమిలి బీచ్ వరకూ సాగర తీరం అంతా గోలుసు మాదిరిగా సుమారు 1.50లక్షల మందితో యోగా చేపట్టేందుకు అధికారులపై తీవ్ర ఒత్తిడి తేవడం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం కూడా యోగాకు వంతపాడుతూ వాస్తవ ప్రజా సమస్యలనుంచి డైవర్షన్ చేసే దిశగా అడుగులు వేస్తుందా? అనే చర్చ ప్రజల్లో జరుగుతోంది.

యోగా దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

ఒక గంట యోగా ప్రాక్టీస్ చేయించాలని, ఈ ప్రక్రియను పక్కాగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వైద్య, నర్సింగ్ కళాశాల విద్యార్థులను, ఆయా శాఖలు, సంస్థల ఉద్యోగులు, కార్మికులతో పాటు కుటుంబ సభ్యులను కూడా 21వ తేదీన జరిగే ప్రధాన కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. సమావేశంలో భాగంగా జిల్లాలో చేపట్టిన చర్యల గురించి జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పిపిటి సాయంతో వివరించారు. కార్యక్రమంలో డిఐజి గోపీనాథ్ జెట్టి, డిసిపి అజిత, విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్ భవానీశంకర్, భీమిలి ఆర్‌డిఒ సంగీత్ మాధుర్ ఇతర జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



విశాఖపట్నం పోర్టులో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ప్రారంభం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ బిల్డింగ్‌లో బుధవారం ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) ఛార్జింగ్ స్టేషన్లను పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా పోర్టు చైర్మన్ మాట్లాడుతూ రెండు డీసీ ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్లు, రెండు ఏసీ ఛార్జింగ్ స్టేషన్లు (7 నుండి 22 కిలోవాట్ల శక్తితో) ఏర్పాటుచేసినట్లు చెప్పారు. వీటి ద్వారా ఒకేసారి ఆరు ఎలక్ట్రిక్ వాహనాలను ఛార్జ్ చేయవచ్చని తెలిపారు. పోర్టులో ఈవీ ఛార్జింగ్ సదుపాయాల ఏర్పాటుతో మంత్రిత్వ శాఖ రూపొందించిన హరితసాగర్ మార్గదర్శకాల్లో పేర్కొన్న లక్ష్యాలను పోర్టు సమర్థవంతంగా సాధిస్తోందని పేర్కొన్నారు. సముద్ర రంగంలో కార్బన్ ఉద్గారాలను తగ్గించే దిశగా భారత ప్రభుత్వం చేపట్టిన గ్రీన్ ఎనర్జీ ప్రోత్సాహానికి పోర్టు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పోర్ట్ కార్యదర్శి టి.వేణుగోపాల్ మాట్లాడుతూ, పోర్టులో గ్రీన్ ఎనర్జీ, సస్టెయినబుల్ ట్రాన్స్‌పోర్ట్ మౌలిక సదుపాయాల ఏర్పాటులో ఇది కీలకమైన ముందడుగని పేర్కొన్నారు.

వాల్తేరు డివిజన్ పిఆర్‌ఒగా జయరాం



ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో చీఫ్ పబ్లిసిటీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న బిర్లంగి జయరామ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా ప్రమోషన్ పొందారు. ఈ మేరకు ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయం నుంచి ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ నందిగామ సింహానంద కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జయరామ్‌కు సహచర సిబ్బంది అభినందనలు తెలిపారు.

మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తా

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



పోర్టు చైర్మన్ అంగముత్తుకు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చెప్పారు. విశాఖపట్నం పోర్టుతో కలిసి ఉన్న సమస్యలను చర్చించడానికి పోర్టు చైర్మన్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు కృషిచేస్తానని చెప్పారు. మత్స్యకార సంఘాల నాయకులతో కలిసి మంగళవారం విశాఖపట్నం పోర్టు చైర్మన్ అంగముత్తును కలిశారు. ఈ సందర్భంగా ఫిషింగ్ హార్బర్లో మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలను పోర్టు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. వీటిల్లో ప్రధానంగా కోవిడ్ టైంలో మత్స్యకారులు పోర్టుకు కట్టాల్సిన పన్నులను చెల్లించలేదని, ఆ బకాయిలను రద్దు చేయాలని కోరారు. పడవలను వార్ఫ్‌పై ఉంచేందుకు అవసరమైన క్రేన్లను పోర్టు ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి పోర్టు చైర్మన్ హామీ ఇచ్చారు. ఎస్-ఎల్ కాలువ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పోర్టు చైర్మన్‌ను ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్ అసోసియేషన్, డాల్ఫిన్ అసోసియేషన్ ప్రతినిధులు, కూటమి నేతలు, ఫిషింగ్ హార్బర్ పెద్దలు అప్పారావు, లక్ష్మణరావు, వీర్రాజు, నరసింహరావు, బాలాజీ, ధన రాజు, చిన్న ఫిషరీష్ జెడి లక్ష్మణరావు, ఎఫ్‌డి ఆషా జ్యోతి, జివిఎంసి డిఇ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

20 మందికి కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వివిధ శాఖల పరిధిలో పనిచేసేందుకు కారుణ్య నియామకాల కింద మరో 20 మందికి జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ నియామక పత్రాలు అందేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ విసి హాలులో జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్ భవానీశంకర్‌తో కలిసి జూనియర్ అసిస్టెంట్లుగా, కార్యాలయ సహాయకులుగా నియమితులైన వారికి కలెక్టర్ సంబంధిత పత్రాలను అందజేశారు. బాధ్యతగా వ్యవహరించాలని, క్రమశిక్షణతో, విధుల పట్ల అంకితభావం ప్రదర్శించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి ఈశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర పండుగగా నేడు ఎన్‌టిఆర్ జయంతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు జయంతిని బుధవారం రాష్ట్ర పండుగగా జరపాలని ప్రభుత్వం ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో బుధవారం ఉదయం 10 గంటలకు జయంతి నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

10న జర్నలిస్టుల ఆడ పిల్లలకు కేన్సర్ నియంత్రణ ఉచిత వ్యాక్సిన్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షిరీన్ రహమాన్ సహకారంతో జూన్ 10వ తేదీన జర్నలిస్టుల ఆడ పిల్లలకు తుది విడత కేన్సర్ నియంత్రణ ఉచిత వ్యాక్సిన్ వేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పోతుమహంతి నారాయణ్, జి.శ్రీనివాస్ తెలిపారు. విశాఖపట్నం ఎవిఎన్ కళాశాల ఎదురుగా ఉన్న చైతన్య స్రవంతి కార్యాలయం ఆవరణలో వ్యాక్సిన్ శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరు నెలల క్రితం తొలి విడత వ్యాక్సిన్ వేసుకున్న జర్నలిస్టులకు చెందిన ఆడ పిల్లలు ఈ తుది విడత వ్యాక్సిన్ వేసుకోవాలని కోరారు. ఆరోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే శిబిరానికి హాజరుకావాలని కోరారు. కొత్తవారికి ఈ విడత అవకాశం లేదని తెలిపారు.

ఆధార్-బ్యాంక్ అనుసంధానం తప్పనిసరి

పోస్టాఫీసులో ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించబోయే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ కావాలంటే ఆధార్ నెంబర్‌ను బ్యాంక్ ఖాతాతో ఎన్‌పిసిఐ లింక్ చేయడం తప్పనిసరి అని విశాఖపట్నం డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ గజేంద్ర కుమార్ మీనా తెలిపారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ సేవింగ్స్ ఖాతాలతో ఆధార్ లింకేజ్ కోసం ఈ నెల 31 నుంచి జూన్ 4వ తేదీ వరకు పోస్టాఫీసుల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపిపిబి) అకౌంట్‌తో ఆధార్ అనుసంధానం జరిగిన తర్వాత పథకాల ద్వారా జమ అయ్యే నగదును ఏ పోస్టాఫీసులో అయినా తీసుకోవచ్చని చెప్పారు. ఫోన్‌పే, గూగుల్ పే వంటి యాప్‌లకు లింక్ చేసి ఎన్ఇఎఫ్ టి, ఐఎంపిఎస్, యుపిఐ లావాదేవీలు చేయవచ్చని పేర్కొన్నారు. ఇంకా ఆధార్ ఐపిపిబి అకౌంట్ లింకేజ్ చేయని వారు దగ్గరలోని పోస్టాఫీస్‌ను సంప్రదించాలని సూచించారు.

కొండవాలు ప్రజల్లో వర్షం గుబులు



రక్షణ గోడలు లేక బంగ్లామెట్ట కొండవాలు ప్రాంతాల్లో జారిపోతున్న మట్టి

- ఐదేళ్లయినా బంగ్లామెట్టలో కానరాని రక్షణ చర్యలు
- బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్న నివాసితులు

ప్రజాశక్తి -తగరపువలస : వర్షాల సీజన్ వచ్చిందంటే జివిఎంసి 1,2 వార్డుల పరిధిలోని కొండవాలు ప్రాంతాల నివాసితుల్లో గుబులు మొదలౌతొంది. ఏటా భారీవర్షాలు, తుఫాన్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సరైన రక్షణ చర్యలు, సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్ల వర్షసీజన్ వచ్చిందంటే వీరిలో కలవరం మొదలౌతోంది. జివిఎంసి ఒకటో వార్డు బంగ్లా మెట్ట, పంప్ హౌస్‌కు అనుకుని ఉన్న కొండపేట, అంగిమెట్ట, రెండో వార్డు రైతు బజారును ు అనుకుని సత్యనారాయణ పేట ఇలా ఏళ్ల తరబడి కొండలపై నివసిస్తున్న అనేక కుటుంబాలు వర్షాలంటేనే హడలిపోతున్నారు. హుదూద్ తుపాను దెబ్బకు సత్య నారాయణ పేట కొండపై ఓ ఇంటి గోడ కూలిన ఘటన నేపధ్యంలో రైతు బజారును అనుకుని యుద్ధ ప్రాతిపదికన రక్షణ గోడను నిర్మించారు. అయితే మిగిలిన ప్రాంతాల్లో మాత్రం కొండవాలులో సరైన రక్షణచర్యలు చేపట్టడం లేదనే స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

బంగ్లామెట్ట కొండవాలులో కానరాని రక్షణ చర్యలు

2019లో 'ఫోని' తుపాను దెబ్బకు ఒకటో వార్డు బంగ్లామెట్ట, హైవే, సర్వీస్ రోడ్డుకు అనుకుని కొండవాలు ప్రాంతంలో మట్టితో పాటు బండరాళ్లుజారి రోడ్డుపై పడిన విషయం విదితమే. దీంతో వారం రోజులపాటు అటుగా రాకపోకలు నిలిపేసిన అధికారులు, తాత్కాలిక చర్యలు చేపట్టి చేతులు దులుపుకున్నారు. అయితే సిమెంట్, ఐరన్‌తో పటిష్ఠరక్షణగోడ నిర్మిస్తారని స్థానికులు ఆశించినా, ఐదేళ్లు గడుస్తున్నా అటువంటి చర్యలేవీ చేపట్టలేదని స్థానికులు వాపోతున్నారు.

దీంతో వర్షాల సీజన్‌వచ్చిందంటే చాలు ఇక్కడ పిల్లాపాపలతో నివసిస్తున్న 20 కుటుంబాలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించే పరిస్థితి ఉంది. కొండవాలును ఆనుకుని ఇక్కడ ఇళ్లు ఉండడం, వర్షంతో మట్టి కరిగి అవి కూలిపోవే పరిస్థితి ఉన్నా సరైన చర్యలు లేవని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. తక్షణం తగు చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

వర్షాలొచ్చినపుడే అధికారుల హడావిడి



భారీ వర్షాలు, తుఫానులు వచ్చేటప్పుడు అధికారులు హడావిడిగా వచ్చి, వెళతారు. ఇళ్లను ఖాళీ చేసి పునరావాస కేంద్రానికి వెళ్లమని చెబుతారు. తర్వాత ఎవరూ కనిపించరు. ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టరు.

- ఎస్ రేణుక, బంగ్లామెట్ట

బిక్కుబిక్కుమంటూ జీవనం



వర్షాల సీజన్‌వచ్చిందంటే ఇళ్లల్లో పిల్లాపాపలతో బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిన పరిస్థితి. కొండవాలును అనుకుని ఉన్న ఇళ్లు ఉండడంతో కుటుంబాలతో భయంగా గడపాల్సిన స్థితి. జివిఎంసి స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలి

- ఎస్ సోమమ్మ, బంగ్లామెట్ట

రక్షణగోడ నిర్మించాలి



ఐదేళ్ల క్రితం తుపాన్ దెబ్బకు కొండవాలులో మట్టి, బండరాళ్లు జారి రోడ్డుపై పడ్డాయి. నేటికీ అదే ప్రమాదం పొంచిఉంది. ఇన్నేళ్లయినా ఇక్కడ రక్షణ గోడ నిర్మాణానికి చొరవ చూపకపోవడం దుర్మార్గం.

- ఎస్ నరసయ్యమ్మ, బంగ్లామెట్ట

నేరాలు ఘోరాలు

లారీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : అజాగ్రత్తతో, అతివేగంతో లారీని నడుపుతూ బైకిస్ట్ మృతికి కారకుడయ్యారనే అభియోగం రుజువుకావడంతో లారీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు, రూ.పదివేల జరిమానా విధిస్తూ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎం.ప్రదీప్‌కుమార్ మంగళవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండునెలలు సాధారణ శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. కేసులో బాధితుల తరపున వాదనలు వినిపించిన సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ తెలిపిన వివరాలివి.

2023అక్టోబర్ 7న రాత్రి 9 గంటల ప్రాంతంలో విశాఖ డెయిరీఫారం సిగ్నల్ పాయింట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొట్టడంతో శ్రీకాకుళానికి చెందిన కోరుకొండ అప్పలాచారి మృతి చెందారు. శ్రీకాకుళం నుంచి తన తోటి పనివాడిని బైక్‌పై ఎక్కించుకుని నగరానికి వస్తున్న అప్పలచారి, విశాఖపట్నం డెయిరీఫారం వద్ద సిగ్నల్ పడటంతో బైక్‌ను ఆపాడు. అయితే వెనుకనుంచి వస్తున్న లారీ డ్రైవర్ అతివేగంగా వచ్చి, సిగ్నల్ పాయింట్ వద్ద ఆగి ఉన్న మృతుని బైక్‌ను ఢీకొట్టడంతోపాటు దాదాపు 200 మీటర్ల దూరం ఈడ్చుకుపోవడంతో సంఘటనాస్థలిలోనే కోరుకొండ అప్పలాచారి మరణించారు. అప్పటి ఆరిలోవ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ బి అనిల్‌కుమార్, మృతుని భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం నేరాభియోగ పత్రం కోర్టులో దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి నిందితునిపై నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలు, రూ.పదివేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఇంటర్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు




విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ రాంప్రసాద్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన నోట్ పుస్తకాలు, కాలేజీ బ్యాగ్‌లను మంగళవారం పంపిణీ చేశారు. ఇప్పటి వరకు ఇంటర్‌ఫస్టియర్‌లో 86 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందారని ప్రిన్సిపల్ పి రామ్ ప్రసాద్ వివరించారు. ఇప్పటికే సిద్ధంగా ఉన్న పాఠ్య పుస్తకాలను జూన్ 2 నుంచి ఇంటర్ సెకెండియర్ విద్యార్థులకు అందజేయనున్నట్లు తెలిపారు. వచ్చేనెల 2 నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు

మహానాడుకు తరలిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-ఆనందపురం : కడప జిల్లాలో జరుగుతున్న తెలుగుదేశం మహానాడు సభకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిలుపుమేరకు ఆనందపురం మండలం నుంచి భారీగా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ముందుగా వేములవలస మహాత్మా గాంధీ పూలమార్కెట్ వద్ద ఎన్‌టి రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రెండు బస్సులు, 25 కార్లతో సుమారు 200 మంది తెలుగుదేశం శ్రేణులు మహానాడుకు తరలివెళ్లారు. కార్యక్రమంలో బిఆర్‌బినాయుడు, తాత్రాజు.అప్పారావు, కాకర్లపూడి శ్రీకాంత్, మీసాల సత్యనారాయణ, మహంతి శివాజీ, బమ్మిడి సూర్యనారాయణ, తారక్, కాకర వెంకటరమణ, వరప్రసాద్, పేకేరు.శ్రీను, పాండ్రంకి అప్పలరాజు పాల్గొన్నారు.



ఆనందపురం నుంచి వెళుతున్న టిడిపి నేతలు

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని 33/11కెవి బాకూరుపాలెం ఫీడర్ మరమ్మతులు, నిర్వహణ పనుల నేపథ్యంలో ఈనెల 28న బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఆనందపురం ఆపరేషన్స్ విభాగం ఎఇఇ ఎం.అప్పల నాయుడు తెలిపారు. సంస్థ మూడవ జోన్ ఆపరేషన్స్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు బాకూరుపాలెం, ఇచ్ఛా పురం, చిన్నయ్య పాలెం, రాము నాయని పేట, రేగాని గూడెం, ముకుందపురం కాలనీ తదితర ప్రాంతాల్లో గృహ, వ్యవసాయ, పారిశ్రామిక కనెక్షన్లకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని ఎఇఇ అప్పలనాయుడు తెలిపారు.

అర్హులైన పేదలకు ఇంటి స్థలాలివ్వాలి

ప్రజాశక్తి -గాజువాక: పట్టణ ప్రాంతాల్లో అర్హులైన పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలాలు ఇవ్వాలని సిపిఐ డిమాండ్ చేసింది. మంగళవారం పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవన్ వద్ద దీనికి సంబంధించి వాల్‌పోస్టర్లను సిపిఐ శ్రేణులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని, అర్హులందరికీ సూపర్ 6 పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కె.వనజాక్షి, నాయకులు జి.ఆనంద్, కె.అప్పుత్తరావు, పిల్లా సూర్యపద్మ, పి.అప్పల రాజు, భాస్కరరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి- సీతమ్మధార : వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నాలుగో పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ వాణిశ్రీ తెలిపారు.మంగళవారం అక్కయ్యపాలెం సంఘం ఆఫీస్, దొండపర్తి ప్రాంతాలలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడపరాదని, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర వాహన పత్రాలను కలిగి ఉండడంతోపాటు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని సూచించారు, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించడంతోపాటు సరైన వాహనపత్రాలు లేని పలువురికి జరిమానాలు విధించారు.

గీతం డిగ్రీ, పిజి సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలు

5లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు : 8న గ్యాట్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా నిర్వహిస్తున్న డిగ్రీ, పిజి కోర్సులలో ప్రవేశానికి వచ్చేనెల 8న గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్) నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టర్ ఎమ్.జగదీష్ తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ విత్ కాగ్నిటివ్ సిస్టమ్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో నాలుగేళ్ల బిఎస్‌సి (ఆనర్స్) కోర్సులు, మూడేళ్ల బిసిఎ కోర్సు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే అప్లైడ్ మేథ్స్, బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, డేటా సైన్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో రెండేళ్ల ఎంఎస్‌సి (పిజి) కోర్సులతోపాటు మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసిఎ) కోర్సు నిర్వహిస్తున్నామన్నారు.

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా బిఎస్‌సి, ఎంఎస్‌సి కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. ఆయా ఈ కోర్సులలో ప్రవేశానికి వచ్చేనెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోదలచిన వారు www.gitam.edu గీతం వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ప్రభుత్వాల ఉమ్మడి ప్రవేశ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన వారు, క్యూట్, జెఇఇ వంటి జాతీయస్థాయి పరీక్షలలో అర్హత సాధించిన వారు తమ ర్యాంక్ కార్డులతో నేరుగా ప్రవేశాలు పొందవచ్చునని సూచించారు.

నకిలీ హాల్‌టిక్కెట్లతో విద్యార్థులను మోసపుచ్చిన

కాలేజీపై క్రిమినల్ కేసు పెట్టాలి

ప్రజాశక్తి-మధురవాడ : నకిలీ హాల్‌టిక్కెట్లుతో మోసపుచ్చి, ఐదుగురు విద్యార్థులను పరీక్షలకు దూరం చేసి వారి భవిష్యత్‌తో ఆడుకున్న మధురవాడ కెఎంఆర్ జూనియర్ కళాశాల గుర్తింపును రద్దుచేసి, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని. ఆల్‌ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎఐఎస్‌ఎఫ్) విశాఖ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మధురవాడలో కెఎంఆర్ జూనియర్ కళాశాలలో కావ్య శ్రీ, లాలం భాగ్యశ్రీ, భూలక్ష్మి, సాయిస్వాతిక్, జ్యోత్స్న అనే ఐదుగురు ఫీజు చెల్లించినప్పటికీ, వారికి నకిలీ హాల్ టిక్కెట్లు ఇవ్వడంతో ఇంటర్ పరీక్షలకు దూరమయ్యారన్నారు. తద్వారా ఒక విద్యాసంవత్సరం నష్టపోవడంతోపాటు వారి భవిష్యత్‌తో ఆటలాడుకున్న కాలేజీ యాజమాన్యం నిర్వాకంపై ప్రాంతీయ ఇంటర్‌బోర్డు అధికారి సమగ్ర విచారణ జరిపి, సంబంధిత కళాశాల యాజమాన్యంపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ఇటువంటి చర్యలకు మరేఇతర కాలేజీల యాజమాన్యాలు పాల్పడనంతగా చర్యలు ఉండాలన్నారు. దీంతోపాటు విద్యార్థులు చెల్లించిన ట్యూషన్ ఫీజు వాపసు చేయడంతోపాటు వారికి న్యాయం చేయాలని కోరారు. జిల్లాలో కేవలం జూనియర్ కళాశాల గుర్తింపు తెచ్చుకుని నీట్, జెఇఇ, ఎంసెట్ అంటూ ఆర్భాటపు ప్రచారంతో జూనియర్ కాలేజీలను కోచింగ్ సెంటర్లుగా మార్చేసిన ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలేజీల్లో నిబంధనల మేరకు ఫైర్‌సేఫ్టీ, ప్లేగ్రౌండ్, పార్కింగ్, వెంటిలేషన్, సరిపడా మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు లేని వాటిని గుర్తించి చర్యలు చేపట్టాన్నారు. దీనిపై ఇంటర్ బోర్డు తగు చర్యలు చేపట్టకుంటే విద్యార్థులను సమీకరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

విత్తన బంతుల తయారీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎన్‌సిసి అధికారులు, జూ క్యూరేటర్

ప్రజాశక్తి - ఆరిలోవ : జీవరాశికి అడవులు ఊపిరితిత్తుల వలే పనిచేస్తాయని ఆంధ్రప్రదేశ్ ఎన్‌సిసి 13వ బెటాలియన్ ఎలిటి కల్నల్, కమాండింగ్ అధికారి నీరజ్ కుమార్ అన్నారు. మంగళవారం ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల, గ్రీన్ క్లైమేట్ ఎన్‌జిఒ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్‌సిసి విద్యార్థుల భాగస్వామ్యంతో జూ పార్కులో విత్తన బంతుల తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి కల్నల్ జీవన్‌కుమార్ మాట్లాడుతూ విత్తనాల బంతులతో సామాజిక వనాలు పెంచడం ఎంతో అవసరమన్నారు. జూక్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ దేశీయ విత్తనాలను పరిరక్షించుకోవడం ఆనందదాయకమన్నారు. వేసవిలో తినే ఫలాల విత్తనాలను సేకరించి, వాటిని బంతులుగా తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జూ అసిస్టెంట్ క్యూరేటర్స్ గోపాలనాయుడు, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, పీపుల్స్ పవర్ ఎన్‌జిఒ ప్రతినిధులు, ఎన్‌సిసి డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్నిం, సుబేదార్ మేజర్ శ్రీనివాస్, సుహాన్ సింగ్, సునీల్ సింగ్, రవీంద్రసింగ్, అసోసియేట్ ఎన్‌సిసి అధికారులు కెప్టెన్ అనంత్ భాస్కర్, జూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎయులో జాబ్‌మేళా

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్రా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈనెల 28న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కేంద్రం డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్‌ప్లస్, అపోలో ఫార్మశీలో ఫార్మసిస్ట్ ఉద్యోగానికి ఫార్మశీలో డిప్లమో, డిగ్రీ, పీజీ అర్హత కలిగిన 40ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని ఎంపికైన వారికి రూ.15వేలు నుంచి రూ.25వేలు నెలసరి వేతనం ఉంటుందన్నారు.అలాగే మెడ్‌ప్లస్‌లో ఫార్మసిస్ట్ అసిస్టెంట్, వేర్‌హౌస్ హెల్పర్ (పురుషులు మాత్రమే) పోస్టులకు ఏదైన అర్హత కలిగిన 27ఏళ్లలోపు అర్హులని, వేతనం రూ.12వేలు నుంచి రూ.15వేలు ఉంటుందన్నారు. అలాగే సెక్యూరిటీ గార్డు పోస్టులకు పదోతరగతి, ఆపై విద్యార్హత కలిగిన 45ఏళ్లలోపు అర్హులని, వేతనం రూ.12వేలు నుంచిరూ.15వేలు చెల్లిస్తారన్నారు. అలాగే అపోలోఫార్మశీలో ఫార్మసీ అప్రెంటీస్ పోస్టులకు ఏదైనా డిగ్రీ చదవిన 45ఏళ్లలోపు అర్హులని, ఎంపికైన వారికి రూ.11,500 నుంచి రూ.14వేలు వేతనం చెల్లిస్తారన్నారు.

ఇన్ఫోలూమి బిజినెస్ సొల్యూషన్స్ సంస్థలో జూనియర్ వెబ్ డెవలపర్స్ డిజిటల్ మార్కెటర్స్ పోస్టులకు కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీ కలిగిన 27ఏళ్లలోపువారు అర్హులని, ఎంపికైన వారికి రూ.12వేలు నుంచి రూ.20వేలు వేతనం చెల్లిస్తారు. ఇదే సంస్థలో కస్టమర్ సర్వీస్ఎగ్జిక్యూటివ్, ఎడ్యుకేషనల్ కౌన్సిలర్ పోస్టులకు ఏదైనా డిగ్రీ చదవి 27ఏళ్లలోపు వారు అర్హులని, వేతనం రూ.15వేలు నుంచి రూ.18వేలు చెల్లిస్తారన్నారు.

నవత రోడ్డు ట్రాన్స్‌పోర్టులో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఎంబిఎ చదివిన 32ఏళ్లలోపు పురుష అభ్యర్థులు అర్హులని, వేతనం రూ.15వేలు నుంచి రూ.25వేలు చెల్లిస్తారన్నారు.వేర్‌హౌస్ క్లర్క్ పోస్టులకు 32ఏళ్లలోపు ఏదైనా డిగ్రీ చదివిన పురుష అభ్యర్థులు అర్హులని వేతనం రూ.11 వేలు నుంచి రూ.15వేలు చెల్లిస్తారన్నారు.క్యాష్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో మొబైల్ అసెంబ్లింగ్ పోస్టులకు 27ఏళ్లలోపు ఇంటర్, డిగ్రీ చదివిన వారు అర్హులని, వేతనం రూ.16,500 చెల్లిస్తారన్నారు. లిఫ్ట్‌మాన్యుఫ్యాక్చరింగ్ పోస్టులకు ఐటిఐ, డిప్లమో చదివిన 27ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని, ఎంపికైన వారికి రూ.18వేలు నుంచి రూ.24వేలు లోపు నెలసరి వేతనం చెల్లిస్తారన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువీకరణలతో ఈనెల 28న బుధవారం ఉదయం 10గంటలకు ఎయు ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌కు హాజరు కావాలన్నారు.మరిన్ని వివరాలకు డి.శ్యామ్ (మొబైల్: 96660 92491) నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించండి

- పిఎఫ్ అధికారికి భెల్ సిఐటియు, ఇంటక్ నేతల వినతి



పిఎఫ్ అధికారి విశ్వనాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికనేతలు

ప్రజాశక్తి-గాజువాక : భెల్‌లోని ఉద్యోగులు, కార్మికుల పెన్షన్ సమస్యలను పరిష్కరించాలని ఇపిఎఫ్ఒ అధికారి విశ్వనాథ్‌కు భెల్ సిఐటియు, ఐఎన్‌టియుసి నేతలు వినతిపత్రం అందజేశారు. 1992 నుంచి వివిధ సిరీస్‌లలో జాయిన్ అయిన భెల్ ఉద్యోగులకు జాయినింగ్ తేదీ సరిగా నమోదు కానందున ఆర్థికపరమైన ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని విన్నవించారు. దీంతో చాలామందికి నిబంధనల ప్రకారం రావాల్సిన పెన్షన్ పూర్తి మొత్తంలో అందడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. పిఎఫ్ యంత్రాంగం నిర్వాకం వల్లే భెల్ ఉద్యోగులు నష్టపోయే పరిస్థితి ఉందని, దీనిపై ఇపిఎఫ్ఒ స్పందించి, ఉద్యోగుల్ డేట్ ఆఫ్ జాయినింగ్ సరిచేసి పూర్తి పెన్షన్ వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, విశ్రాంత ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ అందాల్సి ఉన్నప్పటికీ, భెల్ ఉద్యోగులకు అందడం లేదన్నా్రు. దీనిపై ఆయా విశ్రాంత ఉద్యోగులు దరఖాసు చేసుకుంటే,వారి అభ్యర్థనను తిరస్కరిస్తున్నట్లు ఇపిఎఫ్ఒ నుంచి మెయిల్స్, మెసేజ్‌లు వచ్చాయన్నారు. ఇతర భెల్ యూనిట్లలో విశ్రాంత ఉద్యోగులు, కార్మికులందరికీ హయ్యర్ పెన్షన్ వర్తిస్తుండగా, ఒక్క విశాఖలోని భెల్ యూనిట్‌లోని పెన్షనర్లకు మాత్రమే హయ్యర్ పెన్షన్ రావడం లేదన్నారు. దీనిపై ఎన్నిసార్లు పెన్షనర్లు వ్యక్తిగతంగా, యూనియన్ పరంగా మొరపెట్టుకోవడంతోపాటు తమ సమస్యలను ఆందోళన రూపంలో వ్యక్తం చేస్తున్నప్పటికీ సరైన చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇపిఎఫ్ కార్యాలయం నుంచి స్పందించి, భెల్ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించి, న్యాయం చేయాలని వేడుకున్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో జెటిపి ప్రకాష్, సీతన్న నాయుడు, ఎస్ జగన్నాథరావు, పి ఆనందకుమార్, కె నారపరెడ్డి, అల్లు అప్పారావు, జి అచ్చంనాయుడు ఉన్నారు.

ప్రభుత్వం దృష్టికి జర్నలిస్టుల సమస్యలు

- 29న ఎయులో ఎపియుడబ్ల్యుజెఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం



మాట్లాడుతున్న ఎపిడబ్ల్యుజెఫ్ నేతలు

ప్రజాశక్తి- సీతమ్మధార/ కలెక్టరేట్ : వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలపై ఈనెల 29న గురువారం ఎయు ప్లాటినం జూబ్లీ హాల్‌లో నిర్వహించే ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పి. నారాయణ తెలిపారు. మంగళవారం అక్కయ్యపాలెంలోని ప్రయివేటు హోటల్‌లో ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఎపియుడబ్ల్యుజె జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రకార్యవర్గ సమావేశానికి అన్ని జిల్లాల నుంచి 70 మంది ప్రతినిధులు హాజరౌతారన్నారు. సమావేశంలో ప్రధానంగా వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, అర్హులకు అక్రిడిటేషన్లు, జర్నలిస్టుల సంఘాలకు కమిటీల్లో ప్రాతినిధ్యం, ప్రమాద బీమా తక్షణం పునరుద్ధరణ, 11 రాష్ట్రాల్లో విజయవంతంగా అమలు చేస్తున్న పెన్షన్ విధానాన్ని ఎపిలోనూ అమలు చేయాలని, పార్లమెంటులో చర్చించిన విధంగా ఎపిలో మీడియా కమిషన్ ఏర్పాటు, చిన్న, మధ్య తరహా పత్రికలకు ఎంప్యానెల్‌తో సంబంధం లేకుండా ప్రభుత్వ ప్రకటనలు ఇచ్చి ప్రోత్సహించాలని ప్రధానంగా ఐదుతీర్మానాలు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, ఐటి, విద్యాశాఖమంత్రి లోకేష్‌కు నివేదిస్తామన్నారు. రాష్ట్ర మహాసభలకు ఆయా నేతలను ఆహ్వానిస్తామన్నారు. రాష్ట్రకార్యవర్గ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులుతోపాటు ముఖ్య కార్యవర్గ సభ్యులు హాజరౌతారన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పిఎస్. ప్రసాద్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రంగధామం, ఉపాధ్యక్షులు ఆనంద్, ఎపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కింతాడ మదన్, అసోసియేషన్ ప్రతినిధులు మళ్ల త్రినాథ్, డిపి నాయుడు, జిఆర్ఎస్ రమేష్, స్మాల్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్‌రావు, కార్యదర్శి శ్రీనివాసరావు, కెవి శర్మ, ప్రసాద్ పాల్గొన్నారు

31న అవినాష్ స్మారక కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - మాధవధార : కూన అవినాష్ ఆరవ వర్ధంతి సందర్భంగా మాధవధారలోని మాధవ యువజన సమాజం ఆవరణలో ఈనెల 31, వచ్చేనెల 1న కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు అవినాష్ సావే ఫౌండేషన్ ఛైర్మన్ కూన వెంకటరావు తెలిపారు. కబడ్డీ పోటీలలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు పప్పల వరాహ నరసింహం, మొబైల్ నెంబర్ 9603729785కు సంప్రదించాలని సూచించారు. విజేతలకు ఒకటో తేదీన బహుమతులు అందజేస్తామన్నారు. అవినాష్ పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎంతోమంది పేద ప్రజలకు అండగా నిలిచి, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెంకటరావు తెలిపారు.

డిప్యూటీ మేయర్ గోవిందరెడ్డికి సన్మానం



డిప్యూటీ మేయర్‌ను సత్కరిస్తున్న ఉక్కు నిర్వాసిత సంఘం నేతలు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన దల్లి గోవిందరెడ్డిని మంగళవారం ఉక్కు నిర్వాసిత సంఘం నాయకులు, పెంటమాంబ ఆలయ కమిటీ డైరెక్టర్లు, సభ్యులు, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వాసిత నాయకులు ఈ ప్రాంతం నుండి డిప్యూటీ మేయర్‌గా గోవిందరెడ్డి ఎన్నిక కావడం ఆనందదాయకమన్నారు. .ఈ ప్రాంతం అభివృద్ధికి, నిర్వాసిత కాలనీల్లో సౌకర్యాల కల్పనకు గోవిందరెడ్డి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గొందేశి మహేశ్వరరెడ్డి, సత్యారావు, గొందేశి అప్పలరెడ్డి, ఎల్లేటి శ్రీనివాసరావు, గంట్యాడ పైడిరాజు, పిట్ట కుంచరావు, నీలాపు పరదేశీ పాల్గొన్నారు.

వీర వనితలను స్మరించుకుందాం

ప్రజాశక్తి -పద్మనాభం : వీర వనితలను స్మరించుకుందామని విశాలాక్షి ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రూపాకుల రవికుమార్ అన్నారు. మంగళవారం పద్మనాభ మండలం గోస్తని విద్యాపీఠ్ ఆవరణలో అహల్యాబాయ్ హోల్కర్ త్రిశతజయంతిని నిర్వహించారు.ఈ సందర్భంగా అహల్యాబాయ్ హోల్కర్ చిత్రపటానికి ఇపిటిఆర్ మీనాకుమారి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు

సుపరిపాలన, మహిళా సాధికారత , సామాజిక న్యాయంతో జాతి నిర్మాణం చేపట్టిన అహల్యాబాయ్ హోల్కర్ అందరికీ ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా వందమంది మహిళలకు జాకెట్ ముక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తమటపు నాగమణి, రెడ్డిపల్లి శ్రీనివాసరావు గుడివాడ నరసింహులు, పాలూరి కష్టారావు, మచ్చ సోమేష్ , ఎస్ వెంకటరావు ఈశ్వరమ్మ కళావతి సత్యవతి బాలాజీ పాల్గొన్నారు.

కందుకూరికి ఘననివాళి



నివాళులర్పిస్తున్న సిఐటియు, పిఎన్ఎం నేతలు

ప్రజాశక్తి - ఆరిలోవ: మహిళల విద్య, హక్కుల సాధన, మూఢాచారాలకు వ్యతిరేకంగా సామాజిక మార్పుకోసం పోరాడిన సంఘ సంస్కర్త,కందుకూరి వీరేశలింగం అని పలువురు కొనియాడారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఆరిలోవ బిఎన్ఆర్ నగర్‌లో కందుకూరి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం సామాజిక రుగ్మతలు, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా, మహిళల హక్కుల కోసం కందుకూరి వీరేశలింగం పోరాడారన్నారు. కార్యక్రమంలో నాయకులు సన్యాసమ్మ, కళాకారులు మౌనిక, మంగ, హిమ కృతి, చరిస్మా, ముత్యాలమ్మ, కుమారమ్మ, జ్యోతి పాల్గొన్నారు.


విశాఖ కలెక్టరేట్ : మూఢనమ్మకాలు, బాల్య వివాహాలతో పాటు, సమాజంలో ఉన్న అనేక రుగ్మతలపై పోరాడిన సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతిని ప్రజానాట్యమండలి జిల్లా కార్యాలయం హాష్మీ భవనంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు తెలుగు రమణ, మహిళా సంఘం నాయకులు బొట్టా ఈశ్వరమ్మ, సుజాత, సుమిత్ర,



నివాళులు అర్పిస్తున్న ఐద్వా, పిఎన్ఎం నేతలు

ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి, సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందుతున్న బాల బాలికలు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు రమణ మాట్లాడుతూ ఆనాటి రోజుల్లోనే సమాజ మార్పు, విద్య, మహిళల హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి వీరేశలింగం అని కొనియాడారు. ఆయన బాటలో నేటితరం బాలలు, పిల్లలు కళాకారులు అందరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాన్స్ శిక్షకులు శ్యామ్, లాస్య, పిఎన్ఎం నాయకులు ఎం.నాగేశ్వరరావు, జయలక్ష్మి, మహేంద్ర పాల్గొన్నారు.

కోడూరులో రెవెన్యూ మాయ



- సర్వే నెంబర్ 20లో పరిహారం పేర రూ. 6.38 కోట్లు స్వాహా
- లబ్ధిదారుల పేర్లు వెల్లడించని వైనం
- తహశీల్దారు పాత్రపై సందేహాలు
- విచారణ జరపాలని టిడిపి నాయకుల డిమాండ్
- ఎమ్మెల్యే ప్రేక్షక పాత్రపై విమర్శలు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

పరిశ్రమల కోసం అనకాపల్లి మండలం కోడూరు గ్రామంలో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో మరో స్కాంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూమిలో సాగులో ఉన్నట్లు చూపించి ఏకంగా రూ.6.38 కోట్లు స్వాహా చేసినట్లు అధికార పార్టీ నాయకులే బాహాటంగా విమర్శిస్తున్నారు. దీనిలో ప్రస్తుత తహశీల్దారు పాత్రపై సందేహాలను వ్యక్తపరుస్తూ.. సమగ్ర విచారణ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇదే క్రమంలో స్థానిక ఎమ్మెల్యే ప్రేక్షక పాత్ర వహించడంపై కూడా విమర్శలు గుప్పిస్తున్నారు.

పరిశ్రమల ఏర్పాటు కోసం అంటూ కోడూరులో 200 ఎకరాలు గతంలోనే ఎపిఐఐసి వారు భూసేకరణ చేపట్టారు. అయితే సర్వేనెంబర్ 20లో కొందరు తాము సాగులో ఉన్నామని, పరిహారం చెల్లించాలని అప్పటిలో రెవెన్యూ అధికారులకు అర్జీ పెట్టారు. 2016లో అప్పటి తహశీల్దారు విచారణ అనంతరం భూమి ప్రభుత్వానిదే తప్ప ఎవరు సాగులో లేరని నిర్ధారించారు. తర్వాత పనిచేసిన తహశీల్దారు సైతం దానినే ధ్రువీకరించారు. అయితే ఇటీవల కాలంలో వాటిని మరుగునపడేసి ప్రస్తుత రెవెన్యూ అధికారులు చక్రం తిప్పారనే ప్రచారం వినిపిస్తోంది. చాన్నాళ్ళ నుంచి డీటీగా ఇక్కడే పని చేసిన ఓ అధికారి భూములను అటు ఇటు చేయడంలో సిద్ధహస్తుడనే విమర్శలు గతంలోనే వినిపించేవి. గత తహశీల్దార్లు ప్రభుత్వ భూమిగా నిర్ధారించగా, ప్రస్తుత తహశీల్దారు ఆ భూమిలో సాగులో ఉన్నారంటూ కొందరికి ప్రభుత్వ సొమ్ము పరిహారం రూపంలో అందేలా చేశారు. ఈ విధంగా రూ.6.38 కోట్లు స్వాహా చేశారు. దీనిలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకుల పాత్ర ఉందనేది క్షేత్రస్థాయి విమర్శలు వినిపిస్తున్నాయి.

లబ్ధిదారుల పేర్లు వెల్లడించని రెవెన్యూ అధికారులు

ఇవన్నీ ఒక ఎత్తయితే అసలు ప్రభుత్వం నుంచి ఒక రూపాయి ఎవరికి వెళ్లినా సమాచారాన్ని బహిరంగపరచాల్సి ఉండగా, ఆరున్నర కోట్ల రూపాయలను పంచేసి ఎవరికి ఇచ్చారో అనే సమాచారాన్ని మాత్రం అధికారులు వెల్లడించడం లేదు. దీనిపై డిప్యూటీ తహశీల్దారును అడిగితే తహశీల్దారు చెబితేనే వెల్లడిస్తామంటున్నారు. తహశీల్దారును అడుగుదామంటే ఆయన అసలు కార్యాలయంలో అందుబాటులో ఉండటం లేదు. దీనిపై ఆర్‌డిఒ అధికారులను అడిగితే తహశీల్దారును అడగాలన్నది వారి సమాధానం. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు ఇలా అడ్డగోలుగా అక్రమంగా ప్రభుత్వ సొమ్మును కాజేస్తే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఈ వ్యవహారంపై ఇటీవల టిడిపి మినీ మహానాడులో కొందరు లేవనెత్తారు. ఇందులో ప్రస్తుత తహశీల్దారు పాత్రపై సందేహాలు వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. మరో వైపు అవినీతిని ఎండగట్టాల్సిన స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అవినీతిని అంతం చేస్తామని, అవినీతికి పాల్పడిన అధికారులను నాయకులు వదిలేది లేదని చెబుతున్నారు. మరి అనకాపల్లి మండలం కోడూరు భూ సేకరణలో పరిహారం రూపంలో ఆరున్నర కోట్లు అవినీతిపై విచారణ చేస్తారా? స్థానిక నాయకులు నుంచి ప్రభుత్వానికి వెళ్లిన విచారణ డిమాండ్ పనిచేస్తుందా? అనేది వేచి చూడాలి.



ఎపిఐఐసి సేకరించిన భూమి ఇదే...



లీకై బయటకు వస్తున్న వ్యర్థ రసాయన జలాలను చూపిస్తూ మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ

కాలుష్యానికి కారణమైన రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని జెఎన్ ఫార్మాసిటీలో రాంకీ యాజమాన్యం విడుదల చేస్తున్న కాలుష్యంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. రాంకీ యాజమాన్యం విడుదల చేస్తున్న కాలుష్యం వలన ప్రజల తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇటీవల మల్లోడు గెడ్డలోకి రాంకీ యాజమాన్యం రసాయనిక వ్యర్థ జలాలను విడిచి పెట్టడం వల్ల తీవ్రమైన దుర్గంధం వెదజల్లబడుతుందని, భూగర్భ జలాలు నాశనమవుతున్నాయని తెలిపారు. నాణ్యమైన పైప్‌లైన్ లేకపోవడంతో మాన్యువల్ నుండి పొంగిపొర్లిన వ్యర్థ రసాయనాలు వలన ఫార్మా పరిశ్రమలు చుట్టూ తీవ్రమైన వ్యర్థ జలాలు కాలువల్లోకి పొంగిపొర్లుతున్నాయని చెప్పారు. సమీపంలో ఉన్న కాలువలో నుండి చెరువుల్లోకి ఈ వ్యర్థ జలాలు వస్తున్నాయన్నారు. తిక్కవానిపాలెం సముద్రంలో కూడా శుద్ధి చేసిన జలాలు విడుదల చేయకుండా వ్యర్థ రసాయనిక జలాలను విడుదల చేయడం, పైప్‌లైన్ పగిలిపోవడం వంటి ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ, మత్స్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. లేక పోతే ప్రజాపోరాటం తప్పదని హెచ్చరించారు.

రాయితీపై పశుదాణా పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : జిల్లా పశు సంవర్ధ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని తాళ్లపాలెం గ్రామీణ పశువైద్య కేంద్రం వద్ద 50 శాతం రాయితీపై రైతులకు పశు దాణా మంగళవారం పంపిణీ చేశారు. 50 కేజీల బస్తా ధర రూ1110 కాగా రూ.555కు అందజేశారు. కన్నూరుపాలెం పశు వైద్య అధికారి ఎం.దయనా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు కాయల మురళి, ఉగ్గిని రమణమూర్తి, కర్రి వెంకట సత్యనారాయణ, నైనముశెట్టి రమణరావు, కలగా సోమేశ్వరరావు, దొడ్డి నాగేశ్వరరావు, తాళ్లపాలెం జెవిఓ కరుణశ్రీ, సన్యాసిరావు, సచివాలయం సిబ్బంది ఈశ్వరరావు పాల్గొన్నారు.

సురక్షిత విధానంలో మగ్గబెట్టిన మామిడి పండ్లను మాత్రమే విక్రయించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : సురక్షిత విధానంలో మగ్గబెట్టిన మామిడిపండ్లను మాత్రమే విక్రయించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఇంచార్జ్ జాయింటు కలెక్టరు, జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్లో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఉద్యానశాఖ అధికారులు పండ్లను మగ్గబెట్టే సురక్షిత విధానాలపై రైతులకు, వ్యాపారులకు తెలియజేయాలని సూచించారు. ముఖ్యంగా మామిడి పండ్ల సీజనులో మానవులకు హానికలిగించే కాల్షియమ్ కార్బైడ్ ఉపయోగించి పండ్లు మగ్గబెట్టే విధానాన్ని పూర్తిగా అరికట్టాలన్నారు. అందుకుగాను రైతులకు, అవగాహన కల్పించాలని, వ్యాపారులకు కార్బైడ్ వినియోగిస్తే తీసుకొనే చర్యలను గూర్చి తెలియజేయాలని కోరారు. ఆహార భద్రతా శాఖ సిబ్బంది ఇప్పటివరకు 26 శాంపిల్స్ సేకరించారని, ఆహార ప్రయోగశాల నివేదికలు అందిన తర్వాత కార్బైడ్ వాడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు. జిల్లా పంచాయతీ శాఖ, మున్సిపల్ సిబ్బంది చిన్న వ్యాపారులకు కార్బైడ్ వినియోగం వలన కలిగే అనర్థాలను తెలియజేయాలని, రవాణాశాఖ సిబ్బంది మామిడి పండ్ల రవాణా వాహనాలను తనిఖీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ, మార్కెటింగ్, మున్సిపాలిటీ, మెడికల్, హెల్త్, పంచాయతీ, హార్టికల్చర్, ట్రాన్స్పోర్ట్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఓ సత్యనారాయణరావు

జీవో 4పై పునరాలోచించాలని విఆర్‌ఒల వినతి



కె.కోటపాడు తహశీల్దారు రమేష్‌బాబుకు వినతి ఇస్తున్న విఆర్‌ఒలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : రేషన్‌లైజేషన్ పేరుతో గ్రామ రెవెన్యూ అధికారుల సంఖ్యను తగ్గిస్తూ ఇచ్చిన జీవో నెంబర్ 4పై ప్రభుత్వం పునరాలోచించాలని మండల విఆర్వోలు మంగళవారం స్థానిక తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల విఆర్‌ఒల సంఘం అధ్యక్షులు అనంత్, జిల్లా విఆర్వో సంఘం ఉపాధ్యక్షులు పూడి సురేష్ విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సచివాలయాలను జనాభా ప్రాతిపదికన నిర్ణయిస్తూ రెండు సచివాలయాలను కలిపి క్లస్టర్ ఏర్పాటు చేసి ఒక సచివాలయానికి వీఆర్వోను మరో సచివాలయానికి సర్వేయర్ కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ క్లస్టర్ విధానం వల్ల సుమారు 7,502 మంది వీఆర్వోలు మిగులు సిబ్బందిగా చూపించి ఏ సచివాలయంలోనూ కేటాయించకపోవడం తమను ఆందోళనకు గురిచేస్తుందని పేర్కొన్నారు. మిగులు సిబ్బందిని ఏ శాఖలో సర్దుబాటు చేస్తారో స్పష్టత లేదన్నారు. తాము మొదటి నుండి ఈ క్లస్టర్ విధానంలో ఉన్న లోపాలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి ఒక రెవెన్యూ విలేజ్‌కు ఒక విఆర్‌ఓ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్వో సంఘ కార్యదర్శి శివకుమార్, జిల్లా కోశాధికారి గౌరీ శంకర్, ఇతర విఆర్వోలు పాల్గొన్నారు.

సబ్బవరం : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్ 4ను రద్దు చేయాలని మండల విఆర్వోల సంఘం అధ్యక్షులు కె.శేఖర్‌రావు కోరారు. ఈ మేరకు స్థానిక తహశీల్దారు బి చిన్నకృష్ణకు వినత పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోల సంఘ కార్యదర్శి కొల్లి అనంత్, యస్. కామరాజు, బి.అప్పలరాజు,జగన్నాథం, రవి, బి. గోవిందరావు రుక్మిణి, సౌజన్య, నూకరత్నం పాల్గొన్నారు.

మండలంలో భారీ వర్షం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 గంటల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా, ఆ తర్వాత వాతావరణం ఒక్కసారిగా చల్లబడి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ వర్షాలు వేసవి దుక్కులకు మేలు చేస్తాయని రైతులు తెలిపారు.

ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డుకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : అల్లూరి సీతారామరాజు జిల్లా, ఏపీఎస్ఈబీ సీలేరు శాఖలో డిప్యూటేషన్‌పై హోంగార్డుగా విధులు నిర్వహించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన కె.బ్రహ్మారాజుకు, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా చేతుల మీదుగా మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఉమ్మడి విశాఖలోని అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు స్వచ్ఛందంగా విరమణ చెందిన సహోద్యోగికి ఒక రోజు డ్యూటీ అలవెన్స్ రూపంలో కూడగట్టిన 4 లక్షల 7 వేల 965 రూపాయల చెక్‌ను ఎస్పీ తన కార్యాలయంలో అందజేశారు. హోంగార్డుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, విధి నిర్వహణలో మరణించినా, ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులకు ఆర్థిక సహాయం అందించేందుకు, ఈ రెండు జిల్లాల్లో హోంగార్డులు స్వచ్ఛందంగా ఒక రోజు డ్యూటీ అలవెన్స్‌ను విరాళంగా అందించడం అభినందనీయమని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ ప్రతాప్ శేషయ్య, జూనియర్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డుకు చెక్కు అందిస్తున్న ఎస్‌పి



వినతిపత్రం ఇస్తున్న జనసేన నాయకులు రాజు

క్వారీ అక్రమ నిర్వహణకు అడ్డుకట్ట వేయాలి

ప్రజాశక్తి-చోడవరం : మండలంలో జరుగుతున్న క్వారీ అక్రమ నిర్వహణకు అడ్డుకట్ట వేయాలని జనసేన నియోజకవర్గ ఇన్చార్జి పీవీఎస్ఎన్.రాజు మంగళవారం తహశీల్దారు రామారావుకు మంగళవారం వినతిపత్రం అందించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక, మట్టి వంటి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని, కనీసం అధికారులు వాటి వంక కన్నెత్తి చూడటం లేదని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మూలునాయుడు, అల్లం రామాపురం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెం పాల సొసైటీకి పాలు పోసే రైతులు పశువులకు మంగళవారం ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎదకు రాని పశువులు వైద్యం చేశారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షులు గుమ్మడి నారాయణరావు, రైతులు పాల్గొన్నారు.

మావోయిస్టుల మృతదేహాల దహనంపై న్యాయ విచారణ జరిపించాలి : సిపిఎం

ప్రజాశక్తి-చోడవరం : మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహ మరో ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు అప్పగించకుండా ఉద్దేశపూర్వకంగా పోలీసులు దహనం చేయడంపై సమగ్ర విచారణ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ, పోలీసు చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు అప్పగిస్తామని చత్తీస్‌ఘడ్ హైకోర్టుకు అడ్వొకేట్ జనరల్ హామీ ఇచ్చినా, దానిని పాటించకుండా ఏక పక్షంగా మృతదేహాలను దహనం చేయటం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా మావోయిస్టులతో చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని వెంకన్న డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004-2005 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం మంగళవారం జరిగింది. 20 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నాడు చదువు చెప్పిన ఉపాధ్యాయులను జ్ఞాపకం చేసుకుంటూ ఆనాడు హెచ్ఎంగా పని చేసిన కీర్తిశేషులు బాబురావు మాస్టారుకు శ్రద్ధాంజలి ఘటించారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు అడిగి తెలుసుకున్నారు. చదువుకున్న రోజుల నాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. బాబురావు మాస్టర్ పేరుతో ఫౌండేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తమ మిత్రుల్లో ఎవరు చనిపోయిన, బాధలో ఉన్నా వారి కుటుంబాలకు అండగా ఉండాలని నిర్ణయించుకున్నారు. వారి మిత్రుల్లో ఒకరి భర్త చనిపోవడంతో ఆమెకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. వచ్చే మూడు, నాలుగు నెలల్లోనే ఫౌండేషన్ ద్వారా ఫ్యామిలీలతో మరో మీటింగ్ పెట్టాలని నిర్ణయించారు.

బాటసారులకు మజ్జిగ, బిస్కెట్లు పంపిణీ

ప్రజాశక్తి-మునగపాక : మునగపాక గ్రామానికి చెందిన కీర్తిశేషులు పెంటకోట రవి జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు మంగళవారం బాటసారులకు మజ్జిగ, బిస్కెట్ల పంపిణీ చేశారు. ప్రతి ఏటా లాగే ఈ ఏడాది కూడా మూడో వర్ధంతిని పురస్కరించుకొని పంపిణీ చేపట్టినట్లు రవి తండ్రి సన్యాసినాయుడు తెలిపారు. కార్యక్రమంలో రవి కుటుంబీకులు పెంటకోట జగన్నాథం, నాగ అప్పారావు, రవిశంకర్, ఆదివిష్ణు, జగన్, బొడ్డేడ రామారావు, ఆడారి శ్రీరామ్, వెలగ కోటేశ్వరరావు, వరలక్ష్మి, హేమ, లేపాక్షి, భువన శ్రీ, దివ్య తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కన్జర్వేటివ్ రక్షిత ప్రాంతంగా కొండకర్ల ఆవ

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

కొండకర్ల ఆవను వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972 కింద కన్జర్వేటివ్ రిజర్వ్‌గా ప్రకటించడానికి ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. ఈ అంశంపై మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అటవీ, పంచాయితీ, ఇరిగేషన్, ఫిషరీస్, టూరిజం శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కొండకర్ల ఆవ సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించాలని, ఆవ గట్టు పటిష్టం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మురుగునీరు ఆవలో కలవకుండా చర్యలు చేపట్టాలని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చెత్తను ఆవలో వేయకుండా నియంత్రించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. రిసార్ట్స్ నిర్మాణం, రీక్రియేషన్, బోటింగ్ వంటి పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలపై ప్రణాళిక సిద్ధం చేయాలని, ప్రభుత్వ, టూరిజం భూమి ఎంత ఉందనేది నిర్ణయించాలని టూరిజం అధికారులను ఆదేశించారు. జెట్టి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని మత్స్యకారులకు ఫిషింగ్, టూరిజం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలని అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు. భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికల ద్వారా కొండకర్ల ఆవకు ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి, ఇన్చార్జి టూరిజం అధికారి ఎస్.డి.సి కె.మనోరమ, జిల్లా మత్స్య శాఖ అధికారి ప్రసాద్, అటవీ శాఖ అధికారులు ఎం సామ్యూల్, జి. లక్ష్మణ్, సునీల్ కుమార్, జ్యోతిర్మయి, ఇరిగేషన్ అధికారులు వి. బాల, సూర్యం, సాయి, ప్రశాంతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలని భిక్షాటన



భిక్షాటనతో నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ కూలీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న ఆధ్వర్యాన శ్రామికులు మంగళవారం భిక్షాటన చేపట్టారు. మండలంలోని దేవరాపల్లి, నందిపల్లి, కొత్తపల్లి, శ్రీరాపురం గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాలకు వెళ్లికి వెంకన్న వెళ్లి కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ అమలు అస్తవ్యస్తంగా మారిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.8500 కోట్ల మేర కూలీలకు వేతన బకాయిలు చెల్లించాల్సిఉందని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎన్ఆర్ఇజిఎస్ కింద పని చేసే దాదాపు 15 వేల మంది ఉద్యోగులు, సిబ్బంది మూడు నెలలుగా వేతనాలు అందక విలవిల్లాడిపోతున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు దొరకని ప్రస్తుత వేసవి రోజుల్లో ఉపాధి హామీపై ఆధారపడి జీవించే పేదలకు కూలీ డబ్బులు రాకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం పని చేసిన 15 రోజుల లోపే కూలీలకు కూలీ డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని, రాష్ట్ర వ్యాప్తం 39 లక్షల మంది పేదలకు మార్చి 20 నుండి పది వారాలుగా కూలీ డబ్బులు చెల్లించలేదని తెలిపారు. ఇలాగైతే కూలీలు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

సానుకూల దృక్పథంతో విజయం తథ్యం

ప్రజాశక్తి-ములగాడ : స్పష్టమైన లక్ష్యంతో, సానుకూల దృక్పథంతో పనిచేస్తే విజయాన్ని సాధించవచ్చని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ఉపాధ్యాయిని వి.పద్మజ అన్నారు. మంగళవారం మల్కాపురం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో మాట్లాడుతూ, విజయ సాధనకు భావవ్యక్తీకరణ, ఇతరులతో సత్సంబంధాలు ఎంతో అవసరమన్నారు. సవాళ్లను అధిగమించి, నిరంతరం తమ నైపుణ్యాలకు పదును పెట్టుకున్నప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సులభంగా చేరుకోగలరన్నారు గ్రంథాలయాధికారి వి. అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జాతీయ సేవాపథకం జిల్లా నోడల్ అధికారి ఐపిఎస్. భాగ్యలక్ష్మి పర్యవేక్షణలో అంబేద్కర్ జీవిత చరిత్రపై విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించారు. విజేతలుగా నిలిచిన జేసురాజ్, మానస, వెంకట కిషోర్, ప్రేమ్ లిఖిత్, జస్వంత్, చరణ్ తేజ, గౌతమ్, జ్యోతి కిరణ్, పునీత్ వర్మలకు బుద్ధ విహార్‌కు చెందిన నిర్వాహకులు ముగింపు రోజున బహుమతులు అందజేస్తారని ప్రకటించారు. కార్యక్రమంలో స్థానిక మహిళానేత జగదాంబ, యూత్ లీడర్లు జ్యోతిర్మయి, సునీత, నితీష్ పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో వేసవి శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. నిత్యం యోగా చేయడంతో కలుగు ఉపయోగాలను వివరించారు.

సబ్బవరం : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రంథాలయ అధికారిని వి శిరీష ఆధ్వర్యంలో విద్యార్థులకు చెస్ పోటీలు, వైకుంఠ పాళీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్ అధికారి రత్నకుమార్, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో మంగళవారం నర్సంపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సురేష్ కుమార్ రామాయణం, భాగవతంలోని శ్లోకాలను చదివి దాని అర్థం చెప్పారు. నీతి కథలు చదివి వినిపించారు. కార్యక్రమం గ్రంథాలయ అధికారి జగన్, విద్యార్థులు పాఠకులు పాల్గొన్నారు.



తాళ్లపాలెం వేసవి శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

ఘనంగా సత్యసాయి శతజయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : సత్యసాయి శతజయంతి ఉత్సవాలు సందర్భంగా ప్రేమవాహిని రథయాత్ర మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని వారాడ గ్రామంలో రథయాత్ర ప్రారంభమై ఏ కోడూరు, సింగన్న దొరపాలెం, కే కోటపాడు మీదుగా కింతాడ శివారు కూండపువానిపాలెంలోని రామసత్య దేవాలయం వరకు సాగింది. కింతాడలో జరిగిన ముగింపు కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా స్పిరిచువల్ కోఆర్డినేటర్ కామరాజు మాట్లాడారు. అనంతరం అన్నదానం జరిగింది. జిల్లా అధ్యక్షులు కసిరెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం సేవా సంస్థల ప్రతినిధులు శంకర్ శక్తిమూర్తి, కన్నూరు అప్పలనాయుడు, రవిశంకర్, బండారు నారాయణ పాత్రుడు, కోటేశ్వరి కె.కోటపాడు దేవరాపల్లి మండలాల నుండి భక్తులు పాల్గొన్నారు.

ఉద్యమ రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- అనకాపల్లి : ఎంఎస్ఎంఇ సర్వే పూర్తయిన వ్యాపార, పరిశ్రమలు, సేవా రంగ సంస్థల యజమానులు ఉద్యమ రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తులు చేసుకోవచ్చని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వి.ఆదిశేషు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల బ్యాంకు రుణాలు, కేంద్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు మార్కెటింగ్ టెండర్లలో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. అన్ని వ్యాపార, సేవా రంగ తయారీ సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రిజిస్ట్రేషన్ చేసుకునేవారు తమ ఫోన్ నెంబర్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నెంబర్ వివరాలతో హాజరు కావాలన్నారు., ఆసక్తి ఉన్నవారు ఉద్యమ వర్క్ షాపు తేదీల్లో ఆయా మండలాల్లో పాల్గొనవచ్చన్నారు. ఈనెల 29న అచ్యుతాపురం ఎండిఒ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు, ఈనెల 30న వి.మాడుగుల ఎండిఒ కార్యాలయం, 31న చోడవరం ఎండిఒ కార్యాలయంలో వర్క్ షాపులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.

అన్నమయ్య పార్కును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : శారదా నది ఒడ్డున ఉన్న అన్నమయ్య పార్కును పునరుద్ధరించాలని కోరుతూ సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జివిఎంసి కార్యాలయ వద్ద ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం జివిఎంసి జోనల్ కమిషనర్ బివి.రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం మాట్లాడుతూ అనకాపల్లి శారదా నదీ తీరాన 2007లో అప్పటి మంత్రి కొణతాల రామకృష్ణ ఎంతో సుందరంగా ఆహ్లాదకరమైన పార్కును నిర్మాణం చేసి అన్నమాచార్యుల 21 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసి అన్నమయ్య పార్కుగా నామకరణం చేశారని గుర్తు చేశారు. కొంతకాలంగా పార్కును పట్టించుకోకపోవడంతో పూర్తిగా పిచ్చి మొక్కలతో తుప్పలతో, విష సర్పాలకు, అశుద్ధాలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రస్తుత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎంపీ సిఎం రమేష్, జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ హరేంద్రప్రసాద్, స్పందించి అన్నమయ్య పార్కును పూర్తి స్థాయిలో పునరుద్ధరించి, అన్ని మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేష్ గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, ఊడా నాగేశ్వరరావు, ఎవి.రమణమూర్తి, పిరాట్ల నరసింహమూర్తి పాల్గొన్నారు.

వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రాంబిల్లి : రైతులు వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండలంలో వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. భూసార పరీక్షలు చేయించుకొని అధికారులు సిఫార్సు చేసిన మోతాదులో ఎరువులను వాడాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలన్నారు. పచ్చి రొట్ట ఎరువు విత్తనాలు రైతు సేవా కేంద్రాలలో పంపిణీ కోసం సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. రాబోయే ఖరీఫ్ సీజన్ కోసం 784 క్వింటాళ్లు ఆర్‌జిఎల్-2537, 40క్వింటాళ్లు బిపిటి -5204, 32.7 క్వింటాళ్లు ఎంటియు-1224, 19.5 క్వింటాళ్ల ఎంటియు -1318, 6 క్వింటాళ్లు ఎంటియు-1121 సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. కౌలురైతులకు పంట రుణాలు అందించేందుకు 13 మందికి కార్డులు జారీ చేసినట్లు చెప్పారు. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ కోసం రైతుల డేటాను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. రాగి, జొన్న, కొర్రలు వంటి చిరు ధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. యాంత్రీకరణలో భాగంగా రూ.8 లక్షల విలువైన 2 పవర్ టిల్లర్లు, 2 రోటవేటర్లు, 15 ట్రాక్టర్లు, 17 బ్యాటరీ మరియు పవర్ స్ప్రేయర్లను రైతులకు సబ్సిడీపై సరఫరా చేసినట్లు చెప్పారు.

వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి చంద్రశేఖర్ దేవ్

ప్రజాశక్తి -రావికమతం: మీజిల్స్ అండ్ రూబెల్లా వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కే.చంద్ర శేఖర్ దేవ్ తెలిపారు. రావికమతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. రావికమతంలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమం తీరుతెన్నులు గురించి అడిగి తెలుసుకున్నారు. రావికముతో పిహెచ్సిలో వ్యాక్సినేషన్ ఐఎల్ఆర్ తనిఖీ చేశారు. ఏఎన్ఎంలు వాక్సినేషన్ యువన్ పోర్టల్లో నమోదు చేయడంపై అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన సిబ్బందిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓఎస్. రామ చంద్రరావు, ఎంపిహెచ్ఈఓ పి.రాముడు, రావికమతం పిహెచ్సి వైద్యాధికారి ఎస్ శ్రీనివాస్, డి.పుష్పలత, సిహెచ్ఓ కే.హేమచంందర్రావు, హెచ్ఎస్ సత్య నారాయణ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

కారిడార్ నిర్వాసితులకు న్యాయం చేయాలి



వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

వినతిపత్రం అందజేస్తున్న వైసిపి నేత నరసింహమూర్తి

ప్రజాశక్తి -నక్కపల్లి: వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో అన్ని విధాలుగా న్యాయం చేయాలని వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వాసితులతో కలిసి తహసిల్దార్ నరసింహమూర్తి కు వినతిపత్రం అందజేశారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ చెల్లించాలని కోరారు. ఇల్లులు కోల్పోతున్న కుటుంబంలో 18 సంవత్సరాల నిండిన వారందరికీ 25 లక్షల చొప్పున ప్యాకేజీ చెల్లించాలని, సాగు భూముల్లో చెట్లకు పరిహారం చెల్లించాలని, మత్స్యకారులను, వివిధ వృత్తిదారులను అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఎపిఆర్‌జెసిలో 510 సీట్ల భర్తీ

ప్రజాశక్తి -పాడేరు : పాడేరు ఐటిడిఎ ఫరిధిలో చింతపల్లి, కొయ్యూరు, పెదబయలు, అరకు. జి. మాడుగుల మండలాలలోని ఎపి రెసిడెన్సియల్ బాలుర జూనియర్ కళాశాలలలో ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసిలతో పాటు వొకేషనల్ కోర్సులైన అకౌంట్స్ అండ్ టేక్సేసన్, కంప్యుటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్ కోర్సులలో 800 సిట్లకు గాను ఆన్లైన్‌లో 828 ధరఖాస్తులు వచ్చాయని. గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్.రజని తెలిపారు. మంగళవారం స్థానిక తలారిసింగి ఎపిఆర్ జేసి ప్రాంగణంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిడి మాట్లాడుతూ, కౌన్సిలింగ్ లో 510 సీట్లు భర్తీ అయ్యాయని, మిగిలిన సీట్ల భర్తీకి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. పాడేరు, అరకు, జి. మాడుగుల మండలాలలోని ఎపి రెసిడెన్సియల్ బాలికల జూనియర్ కళాశాలలలో 500 సీట్ల భర్తీకి బుధవారం కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. ఈ కౌన్సిలింగ్ లో డి డి తో పాటు గురుకుల కళాశాలల ఓఎస్డి పిఎస్ఎన్ మూర్తి, కళాశాలల ప్రిన్సిపాల్ కన్వీనర్ వై.పారయ్య, ప్రిన్సిపాల్స్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత సాధించాలి

ప్రజాశక్తి-పాడేరు: స్వయం సహాయక సంఘాల మహిళలు చిరువ్యాపారాలు చేసి మహిళా సాధికారత సాధించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. బ్యాంకు లింకేజి ఇచ్చేసి వదిలేస్తే సరిపోదని వ్యాపారాలు చేస్తున్నారా ఆదాయం పెరిగిందా లేదా అని పరిశీలించాలని సూచించారు. మంగళవారం ఐటిడిఏల పి.ఓలు, వెలుగు, ఐసిడిఎస్, గిరిజన సంక్షేమం, డుమా, వైద్య ఆరోగ్య శాఖ, ఎస్ ఎం ఐ, ఎంపిడిఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్యాంకు లింకేజిలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీసారు. ఎన్ని గ్రూపులకు బ్యాంకు లింకేజీ ఇచ్చారు? ఎంత తిరిగి చెల్లించారని అడిగి తెలుసు కున్నారు. ఎంపిడిఓలు ఎంపిఎంలతో రెండు వారాలకు ఒక సారి బ్యాంకు లింకేజీలపై సమీక్షించాలని ఆదేశించారు. బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలు సక్రమంగా తిరిగి చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. 15 రోజులకు ఒక సారి ఎపిఎంలు, ఎంపిడి ఓలతో వెలుగు కార్యక్రమాలపై సమీక్షించాలని ఐటిడి ఏపిఓలకు సూచించారు. సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి సచివాలయం పరిధిలో అవసరమైన రుణ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. జిల్లాలో 28 వేల మంది చిన్నారులకు ఆధార్ లేదని చెప్పారు. విద్యుత్తు లేని అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్తు సదుపాయాం కల్పించాలన్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మాతా శిశు మరణాలు జరగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. మరణాలను సక్రమంగా నమోదు చేయకపోతే వైద్య, ఐసిడిఎస్ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐటిడిఏ పిఓలు ఎం.జె. అభిషేక్ గౌడ, కట్టా సింహాచలం, అపూర్వ భరత్, (వర్చువల్) జి ఎస్ డబ్ల్యూ నోడల్ అధికారి పి. ఎస్. కుమార్, డి ఆర్డి ఏ పి డి వి.మురళి, ఐసిడి ఎస్ పిడి. ఎన్. సూర్యలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎల్. రజని, జిల్లా నైపుణాభివృద్ధి అధికారి రోహిణి, జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు, డ్వామా పిడి విద్యా సాగర్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఆరోగ్యం



కోటవురరట్లలో యోగా చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కోటవురట్ల: ప్రతినిత్యం యోగా చేస్తే ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని తహసిల్దార్ తిరుమల బాబు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు ఆధ్వర్యంలో ఉద్యోగులు యోగా చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు వివిధ ఆసనాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వచ్చేనెల విశాఖలో జరగనున్న యోగాంధ్ర కార్యక్రమానికి ఔత్సాహకులు రిజిస్ట్రేషన్ చేపట్టాలని సూచించారు, ఈ కార్యక్రమంలో పిఓపిఆర్డి రఘురాం, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నక్కపల్లి: యోగాంధ్రపై ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో సీతారామరాజు హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. యోగాంధ్రపై జిల్లా కలెక్టర్ ఆదేశాలను కూడా కొంతమంది సచివాలయ ఉద్యోగులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు.

మాడుగుల : యోగ శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం మాడుగుల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కొంకి అప్పారావు ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ రాజారామ్, తహసిల్దార్ కే రమాదేవి, ఎస్సై జి.నారాయణరావు, ప్రజా ప్రతినిధులు యోగాసనాలు వేసారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ నుండి 30 వరకు యోగ పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

చోడవరం : మండల అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం గంగా ఫంక్షన్ హాల్లో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చి అనంతరం గ్రామాల్లో వారు మరో 150 మందికి శిక్షణ ఇచ్చేలా పరిశీలిస్తున్నామని ఎంపీడీవో జీవీకే ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డి మహేష్ చోడవరం పంచాయతీ వివో నారాయణరావు యోగా గురువు పుల్లటి సతీష్ పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో యోగా ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. మండలంలోని 200 మందిని ఎంపిక చేసి ఐదు రోజులపాటు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీవో ఎంవి.సువర్ణరాజు తెలిపారు. యోగా గురువు గెడ్డం నగేష్, ట్రైనీలు డి.బాబూరావు, సూర్య ప్రకాష్, బి. రాధిక యోగ శిక్షణ ఇచ్చారు. ఆయుర్వేద వైద్యాధికారిణి జి.గ్రీష్మ, మండల పరిపాలన అధికారి డివి. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నుండి జరుగుతున్న యోగ కార్యక్రమాలను మంగళవారం ఎంపీడీవో సాంబశివరావు పరిశీలించారు. గురువారం వరకు మండలంలోని కొరువాడ, పాతవలస, చౌడువాడ, దానివలస పాఠశాల ప్రాంగణాల్లో యోగా యోగ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో యోగా టీచర్ లక్ష్మి పంచాయతీ కార్యదర్శి శ్రీను, జవ్వాది సన్యాసిరావు పాల్గొన్నారు.

'కారిడార్ రోడ్డుకు అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు'

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని కాగిత మీదగా వేస్తున్న కారిడార్ రోడ్డు నిర్మాణానికి అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారని ఏపీ మత్స్యకార జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పిక్కి కోదండరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, రోడ్డు నిర్మాణానికి సంబంధించిన కాంట్రాక్టర్ కొండలను తవ్వేసి, అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టి రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. కనీసం అధికారులు పట్టించుకోలేదన్నారు. ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో ఇసుక, మట్టిని అక్రమంగా తరలించి రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నారని, వెంటనే సంబంధించిన అధికారులు స్పందించి, అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.



నాతవరంలో భారీ వర్షం

ప్రజాశక్తి-నాతవరం : మండలంలో మంగళవారం సాయంత్రం గంటకు పైబడి ఏకధాటిగా భారీ వర్షం పడింది. దీంతో, లోతట్లు ప్రాంతాలు జలమయ మయ్యాయి. రెండు రోజుల నుంచి వర్షాల కారణంగా వాతావరణం చల్లబడింది. నాతవరం నుంచి తాండవ రోడ్డు మార్గం అస్తవ్యస్తంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు.



ఏకగ్రీవ పంచాయతీలకు మంజూరు కాని ప్రోత్సాహక నిధులు

ప్రజాశక్తి-కోటవురట్ల: గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవమైన పంచాయతీలకు ప్రోత్సాహకంగా నిధులు మంజూరు కాలేదు. గడచిన 2020లో జరిగిన జిల్లా వ్యాప్తంగా 64 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కాగా మేజర్ పంచాయతీలకు 10 లక్షలు, మైనర్ పంచాయతీలకు ఐదు లక్షల చొప్పున ప్రోత్సాహక నిధులు అందించాల్సి ఉంది. వీటిలో 51 మైనర్ పంచాయతీలు కాగా, పది పంచాయతీలు మేజర్ పంచాయతీలు ఉన్నట్లు జిల్లా అధికారులు తెలిపారు,

కోటవురట్ల మండలంలో 25 గ్రామ పంచాయతీలకు గాను నాలుగు పంచాయతీలు ఏకగ్రీవమాయ్యాయి. పాములవాక, బోడపాలెం, నీలిగుంట, రామన్నపాలెం ఈ నాలుగు పంచాయతిలు మైనర్ పంచాయతీలు, ఒక్కో పంచాయతీకి 5 లక్షలు చొప్పున మంజూరు కావాలివుంది. కానీ, నేటికీ ప్రోత్సాహక నిధులు మంజూరు కాలేదు. ఆ నిధులు అందక పోవడంతో గెలుపొందిన సర్పంచులు ఎదురు చూస్తున్నారు. తమ హయాంలో మంజూరైన నిధులతో గ్రామంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపడితే తమ పేరు శాశ్వతంగా నిలుస్తుందని వారు భావిస్తున్నారు.

దాదాపుగా పదవీకాలం మరికొద్ది కాలంలో ముగియ నుండడంతో ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులు లేనట్లేనా అంటూ చర్చించుకుంటున్నారు, కూటమి ప్రభుత్వ నాయకులైన ఏకగ్రీవ పంచాయితీ ప్రోత్సాహక నిధుల కోసం చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధికి ప్రోత్సాహక నిధులు మంజూరు చేయాలని కోరుకుంటున్నారు.

బల్క్ డ్రగ్స్ పార్క్‌కు భూములివ్వం

జానకయ్య పేట రైతులు



మాట్లాడుతున్న నాయకులు,నిర్వాసితులు

ప్రజాశక్తి -నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు భూములు ఇచ్చేది లేదని జానకయ్యపేట రైతులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. మండలంలోని జానకయ్యపేట గ్రామంలో రైతులు మంగళవారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజుతో కలిసి మాట్లాడారు. సిహెచ్ లక్ష్మీపురం రెవిన్యూ పరిధిలో జానకయ్యపేటకు చెందిన 90 మంది రైతులకు సంబంధించిన 190 ఎకరాల భూమిని బల్క్ డ్రగ్స్ ఏర్పాటుకు భూసేకరణ చేపట్టనున్నట్లు పత్రికలో ప్రకటన వెలువడిందన్నారు. దీనిని తామంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. పత్రికలో ప్రకటన చూడగానే తామంతా తీవ్ర ఆందోళనకు గురయ్యామన్నారు. ఇప్పటికే భూములు సర్వే చేస్తున్నప్పుడు తామంతా భూసేకరణకు వ్యతిరేకించామని, ఏపీఐఐసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, తహసిల్దార్ ఆధ్వర్యంలో భూసేకరణ చేపట్టేందుకు గ్రామసభ నిర్వహించగా, రైతులంతా భూములు ఇచ్చేది లేదని ముక్తకంఠంతో అధికారులకు తేల్చి చెప్పడం జరిగిందన్నారు. అయినప్పటికీ తమ మనోభావాలను అర్థం చేసుకోకుండా, భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బల్క్ డ్రగ్‌కు భూములు ఇచ్చేది లేదని, భూసేకరణ నోటిఫికేషన్ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, జనసేన పార్టీ నాయకులు కురందాసు అప్పలరాజు, రైతులు దేవర సత్తిబాబు, మామిడి బాబ్జీ, పంపనబోయిన తులసీరావు, చందక నానాజీ, దేవర అప్పలరాజు, మామిడి గణేష్, గింజాల అయ్యులు,కె.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

టీచర్ల బదిలీలకు జిఒ 22ను అమలు చేయాలి

ప్రజాశక్తి -పాడేరు: గిరిజన సంక్షేమ శాఖలోని ఉపాధ్యాయుల బదిలీలకు జీవో. నెంబర్ 22న అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి మహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో అభిషేక్ గౌడకు వినతి పత్రం అందజేశారు. గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల బదిలీలు కూడా ప్రభుత్వ జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల మాదిరి జీవో 22 ప్రకారం బదిలీ చేయాలన్నారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలకు ఒకే చోట ఎనిమిది సంవత్సరాలు కొనసాగించాలని, ఉపాధ్యాయ ఖాళీలను ముందుగా తెలియజేయాలని కోరారు. సీనియారిటీ లిస్టును ఆన్లైన్లో వెలువరించాలని, ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పి దేముడు, ఆడిట్ కమిటీ కన్వీనర్ రఘునాథ్, సబ్ కమిటీ కన్వీనర్ నాగేశ్వరరావు విన్నవించారు.

గాయపడిన వృద్ధుడు మృతి

ప్రజాశక్తి -చింతపల్లి: మండలంలోని చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని బయలుకించంగి గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతీకి చెందిన నడింవాడ (గుండాలగరువు) గ్రామస్తుడు తెరవాడ బాబురావు తన ద్విచక్ర వాహనంపై చింతపల్లి ప్రాంతంలో జరిగిన శుభకార్యానికి హాజరై తిరిగి వెళ్తున్నాడు. బయలుకించంగి గ్రామంలో ఓ వృద్ధుడు ఆటో దిగి వెళుతుండగా ద్విచక్ర వాహనం బలంగా ఢీకొంది. ఈ ఘటనలో జి మాడుగుల మండలం పాలమామిడి పంచాయతీ వనబంగిపాడు గ్రామానికి చెందిన తాంగుల బొజ్జయ్య (70) తీవ్రంగా గాయపడ్డాడు. శరీరానికి బలమైన గాయాలయ్యాయి. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఉగ్రదాడిపై ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించాలి

- సమైక్య యాత్రలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథం



మాట్లాడుతున్న లోకనాథం

ప్రజాశక్తి-పాడేరు: పహల్గాంలో పర్యాటకులను బలిగొన్న టెర్రరిస్టుల ఉగ్రదాడిని ఖండించడంలో దేశ ప్రజానీకం ప్రదర్శించిన ఐక్యత, సమైక్యత, స్ఫూర్తి ప్రజలందరినీ ఒక్క తాటిపై నిలిపిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథం తెలిపారు. ఉగ్రదాడిపై ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై దేశ ప్రజలకు వివరించడానికి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర సమైక్య యాత్రలో భాగంగా పాడేరు జిల్లా కేంద్రంలో మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో సమైక్య యాత్ర ర్యాలీ నిర్వహించారు. పాడేరు మెయిన్ రోడ్ బజారు నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ఈ సమైక్య యాత్ర కొనసాగింది.అనంతరం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పాలిక లక్కు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథం మాట్లాడుతూ, ఉగ్రవాదులు దేశంలో మతపరమైన విభజన తీసుకొచ్చి మత విద్వేషాలు రెచ్చగొట్టడానికి పథకం పన్నారన్నారు. మతోన్మాద శక్తులు ఉగ్రవాదానికి మతంతో ముడి వేసి ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూసారని విమర్శించారు.వక్రబుద్ధితో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దేశాన్ని బలహీన పరచాలనుకున్నారని, ఇలాంటి శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణకు సంబంధించి ఇరుదేశాల ప్రతినిధుల నుండి అధికారిక ప్రకటన రాకుండానే అమెరికా అధ్యక్షుడు ప్రకటన విడుదల చేయడం ప్రజల్లో ఆందోళన వ్యక్తమయ్యిందన్నారు.తృతీయ పక్షం జోక్యం లేకుండా వివాదాలు ద్వైపక్షికంగా పరిష్కరించుకోవలసి ఉందని అన్నారు. కాశ్మీర్ సమస్య పరిష్కారం కోసం కషి చేస్తానని ట్రంప్ చెప్పడం మరింత వివాదస్పదంగా మారిందని పేర్కొన్నారు.

సి.పి.ఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ, దేశ ప్రతిష్టను ట్రంప్‌కి తాకట్టు పెట్టారన్నారు ఉగ్రవాదం పేరుతో మైనారిటీల పై విషం కక్కుతున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కిలో సురేంద్ర, దీసరి గంగరాజు, వి.ఉమామహేశ్వరరావు, బిసి పడాల్, ఎస్పీ పోతురాజు, కె. త్రినాథ్, పాలికి లక్కు, ఎల్ సుందర్రావు పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సిలో ఆదివాసీ పోస్టులు మినహాయించాలి



చింతూరులో చేపడుతున్న దీక్షలు

ప్రజాశక్తి- రంపచోడవరం : 2025 మెగా డిఎస్‌సి నుంచి ఆదివాసి పోస్టులు మినహాయించి ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆదివాసి జేఏసీ కోర్ కమిటీ సభ్యులు కంగాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

13వ రోజు రిలే నిరాహార దీక్షల కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఎపి గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు బుడమల మంగిరెడ్డి మాట్లాడుతూ తక్షణమే (టిఏసి) ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేసి కమిటితో తక్షణమే తీర్మానం చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని, జిఒ నంబర్ 3కు చట్టబద్ధత కల్పిస్తామన్నారు. ఎస్టి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని, రాష్ట్రంలో అన్ని ఐటిడిఎల ద్వారా ట్రైకార్ రుణాలు నిరుద్యోగ యువతకు తక్షణమే మంజూరు చేసి ఉపాధి కల్పించాలని మొదలైన సమస్యల పరిష్కారానికి ఆదివాసి జెఎసి తలపెట్టిన రిలే నిరాహార దీక్షలకు గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం తరపున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు.

ఎపి గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర నాయకులు కారుకోడి గాంధీ మాట్లాడుతూ (టిఎసి) ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ కమిటీ ఏర్పాటు చేసి షెడ్యూల్డ్‌ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించి ఆదివాసీ నిరుద్యోగ పట్టభద్రుల భవిష్యత్తును కాపాడాలని టిఎసి కమిటి సభ్యులు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పల్లాల బాలురెడ్డి, కోసు రామన్నదొర, కోసు ప్రసాద్‌దొర, చోడి వెంకటేశ్వర్లుదొర, మడకం లచ్చన్నదొర, కత్తుల రత్న కుమారి, తుర్రం వెంకటేశ్వర్లుదొర, మడకం వీర వెంకటవరప్రసాద్ దొర, చవలం శభకృష్ణదొర, ఆదివాసి రాష్ట్ర వైస్‌చైర్మన్ తెల్లం శేఖర్, కారం రామన్న దొర, పొడియం శ్రీనుబాబుదొర, పండా పవన్‌కుమార్‌దొర, పొడియం పండు దొర తదితరులు పాల్గొన్నారు.

ఫోటో రైటప్ : 02 రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలిపిన ఆదివాసి జెఎసి కోర్ కమిటి సభ్యులు

చింతూరు : 2025 మెగా డిఎస్‌సి నుంచి ఏజెన్సి ప్రాంత ఆదివాసి టీచర్ పోస్టులను మినహాయించాలని ఆదివాసి జెఎసి రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్, పీసా ఉపాధ్యక్షులు కారం సాయి డిమాండ్ చేశారు. రంపచోడవరం ఐటిడిఎ వద్ద 13వ రోజు రిలే నిరాహార దీక్షలు కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తక్షణమే (టిఎసి)ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేసి కమిటితో తక్షణమే తీర్మానం చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని, జిఒ నంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలని, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసి జేఏసీ తలపెట్టిన రిలే నిరాహార దీక్షలకు పెద్దసీతనపల్లి, ఎర్రపేట గ్రామాల యువత, ఉద్యోగులు,నిరుద్యోగులు, సర్పంచ్, గ్రామస్తులు మద్దతు తెలియజేస్తున్నామన్నారు. షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించి ఆదివాసీ నిరుద్యోగ పట్టభద్రుల భవిష్యత్తును కాపాడాలని టిఎసి కమిటి సభ్యులు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతకుముందు కార్యక్రమానికి ఆదివాసి జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లినరేష్ అధ్యక్షత వహించారు. బిజెపి జిల్లా కార్యదర్శి పాయం వెంకయ్య స్వాగత ఉపాన్యాసంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెఎసి డివిజన్ ఉపాధ్యక్ష శీలం తమ్మయ్య, మడకం లక్ష్మణ్ పాల్గొన్నారు.